రష్మిక నకిలీ వీడియోపై ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ: ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రముఖ హీరోయిన్ రష్మిక మందన్నా ఏఐ ఆధారిత డీప్ ఫేక్ వీడియోపై ఢిల్లీ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. రష్మిక ముఖాన్ని మార్చి కృత్రిమ మేధ ఆధారంగా తయారు చేసిన నకిలీ వీడియోపై రష్మిక సహా పలువురు సినీ, ఇతర రంగాల ప్రముఖులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై స్పందించిన ఢిల్లీ మహిళా కమిషన్ మీడియా రిపోర్టుల ఆధారంగా ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించి ఈ నెల 17లోగా తమకు నివేదిక అందించాలని పోలీస్ శాఖను ఆదేశించింది.

ముస్లిమేతరులపై దాడులకు ఐసిస్ కుట్ర: ఎన్ఐఏ

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ముస్లిమేతరులపై దాడులకు ఏడుగురు అనుమానిత ఐసిస్ ఉగ్రవాదులు కుట్ర పన్నినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఛార్జిషీట్ ఆరోపించింది. వీరంతా సాంకేతికంగా, విద్యాపరంగా బాగా చదువుకున్న వారేనని తెలిపింది. వీరు తమ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు ఐసిస్ ఉగ్రవాద సంస్థ కార్యకలాపాలను నిర్వహించేందుకు నిధులను సేకరించారని పేర్కొంది. దేశంలో ఐసిస్ ఉగ్రవాద భావజాలాన్ని వ్యాపింపజేయడానికి కృషి చేస్తున్న వ్యక్తుల సంక్లిష్టమైన నెట్ వర్క్‌ను గుర్తించినట్లు తెలిపింది. 'రివెంజ్ ఆన్ కాఫిర్స్(తిరస్కరించే వారిపై ప్రతీకారం)' పేరుతో ఉన్న పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. దాడులు చేయడానికి అనుకూలంగా ఉండే ప్రదేశాలను గుర్తించేందుకు మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, తెలంగాణ, కేరళలలో వీరు కొన్ని ప్రాంతాలను పరిశీలించారని తెలిపింది.

చావలేదు.. బతికే ఉన్నా!

'హత్య' కేసులో ప్రత్యక్షమైన బాలుడు

న్యూఢిల్లీ: ఓ బాలుడి హత్య కేసుపై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా సదరు బాలుడు కోర్టులో ప్రత్యక్షమయ్యాడు. యూపీలోని పిలిభిత్‌కు చెందిన ఓ వ్యక్తి తన కుమారుడు హత్యకు గురయ్యాడని, అతడి తాత, మామలు కలిసి ఈ హత్యకు పాల్పడ్డారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అయితే విచారణ జరుగుతుండగా సదరు బాలుడు కోర్టుకు వచ్చి తాను బతికే ఉన్నానని, కావాలనే తన తండ్రి ఇలా నాటకాలాడుతున్నాడని చెప్పాడు. బాలుడి తల్లిని అతడి తండ్రే హత్య చేసినట్టు కేసు నడుస్తున్నది. ఈ క్రమంలోనే బాలుడిని హత్య చేసినట్టు తండ్రి నాటకమాడినట్టు తెలుస్తున్నది.

కెనడాలో ఇద్దరు భారత సంతతి వ్యక్తుల హత్య

ఒట్టావా: కెనడాలో భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యక్తి హర్‌ప్రీత్ సింగ్ ఉప్పల్ (41), ఆయన కుమారుడిని(11) శుక్రవారం కొందరు తుపాకీతో కాల్చి చంపారు. ఈ హత్యకు పాత కక్షలే కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఎడ్మంటన్‌లో రెండు గ్యాంగుల మధ్య కొంతకాలం విభేదాలు కొనసాగుతున్నట్టు సమాచారమున్నదని పోలీసులు చెప్పారు. 2021లో హర్‌ప్రీత్‌సింగ్, ఆయన కుటుంబసభ్యులను చంపడానికి ప్రయత్నం జరిగిందని తెలిపారు.

హర్యానాలో కల్తీ మద్యానికి 19 మంది బలి

చండీగఢ్: హర్యానాలోని యమునా నగర్, అంబాలా జిల్లాల్లో కల్తీ మద్యం తాగి ఇటీవల 19 మంది ప్రాణాలు కోల్పోయారు. గతంలో ఇలాంటి సంఘటనల నుంచి పాఠాలు నేర్చుకోవడంలో ఖట్టర్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్ష పార్టీల నేతలు ఆరోపించారు. ఈ కేసులో పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేశారు. మరికొందరి కోసం గాలిస్తున్నారు. ఓ కాంగ్రెస్ నేత కుమారులు, జన నాయక్ జనతా పార్టీ నేత కుమారులు అరెస్టయినవారిలో ఉన్నారు.

మధ్యప్రదేశ్‌లో తిరుగుబాటు భయం

భోపాల్, నవంబర్ 11: మల్వా-నిమార్.. మధ్య ప్రదేశ్‌లోని 15 జిల్లాలతో 66 అసెంబ్లీ సీట్లున్న ప్రాంతం. ఏ పార్టీ అయిన అధికారంలోకి రావాలంటే ఇక్కడ తప్పక ఆధిపత్యం ప్రదర్శించాల్సిందే. అయితే ఇంత ముఖ్యమైన ప్రాంతంలో ఇప్పుడు అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో రెబల్స్ బెడద అధికంగా ఉంది. ఏ పార్టీకి ఆధిక్యం లభిస్తుందో చెప్పలేని స్థితి నెలకొంది. మొత్తం 66 సీట్లకు 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ ఇక్కడ 35 సీట్లతో స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఇక బీజేపీ అంతకుముందు ఎన్నికల్లో సాధించిన 57 సీట్ల నుంచి దిగజారి 28 సీట్లతోనే సరిపెట్టుకుంది. ఈ ప్రాంతంపై తన పట్టు నిలుపుకోవడానికి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. అందులో భాగంగానే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జరిపిన భారత్ జోడోయాత్ర ఎంపీలో 380 కిలోమీటర్లు సాగగా, అందులో ఈ ప్రాంతానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. గత ఎన్నికల్లో మధ్య ప్రదేశ్‌లో కాంగ్రెస్ మొత్తం 114 సీట్లు గెల్చుకుందంటే అందులో 30 శాతం మల్వా-నిమార్ ప్రాంతానివే. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కారణంగా 2018లో ఈ ప్రాంతంలో భారీగా సీట్లు కోల్పోయిన బీజేపీ ఇప్పుడు తిరిగి అదే ఫీట్ పునరావృతం అవుతుందేమోనని భయపడుతున్నది. మధ్య ప్రదేశ్ ఎన్నికల్లో అతి ముఖ్యమైన మల్వా-నిమార్ ప్రాంతంలో ఇరు పార్టీలకు రెబల్స్ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఇక్కడ వివిధ సీట్లలో పోటీలో ఉన్న రెబల్స్‌లో 12 మంది వరకు అభ్యర్థుల ఫలితాలను మార్చివేసే శక్తి ఉన్నవారు. ఇక కాంగ్రెస్‌ది కూడా ఇదే పరిస్థితి. బాద్‌నగర్, ఇండోర్ జిల్లాలోని మాహ్వ్, మాండసూరి జిల్లాలోని మల్హగర్‌తో పాటు అలట్, జవోరాతో పాటు పలు నియోజవర్గాల్లో తిరుగుబాటు అభ్యర్థుల బెడదను ఎదుర్కొంటున్నారు. ఇటీవల బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన లాడ్లీ బహ్నా పథకం తమను ఈ ఎన్నికల్లో గట్టెక్కిస్తుందన్న ఆశతో బీజేపీ నాయకులు ఉన్నారు. కాగా, ఈ రీజియన్‌లో అత్యధిక ప్రాబల్యం చూపే గిరిజనులు 18 ఏండ్ల బీజేపీ పాలనలో దగాకు గురయ్యారని, వారంతా శివరాజ్ సింగ్‌ను గద్దె దింపి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలను కుంటున్నట్టు ఆ పార్టీ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ ఉచితాల వల

భోపాల్, నవంబర్ 11: ఉచితాలు వద్దని, వాటికి తాము వ్యతిరేకమని చెప్పే బీజేపీ మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అవే ఉచితాలతో ఓట్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నది. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని పలు అంశాలను కాపీ కొట్టిన కమలం పార్టీ మధ్యప్రదేశ్‌లో శనివారం 'సంకల్ప్ పత్ర్' పేరుతో ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది. రాష్ట్రంలోతమకు మళ్లీ అధికారం ఇస్తే లాడ్లీ బహనా యోజన, పీఎం ఉజ్వల లబ్ధిదారులకు రూ.450కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని పేర్కొన్నది. పేద కుటుంబాల బాలికలకు మాత్రమే పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని ప్రకటించింది. కాగా, తెలంగాణలో సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అర్హులైన పేద కుటుంబాలకు రూ.400కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తామని ప్రకటించింది.

రాజస్థాన్‌లోనూ కుర్చీ లొల్లి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ)/న్యూఢిల్లీ : కాంగ్రెస్ అంటేనే కుర్చీల ఆట అనే విషయం అందరికీ తెలిసిందే. కీలక పదవుల్లో ఉన్నవారే పార్టీ అధిష్ఠానానికి కొరకరాని కొయ్యగా మారడం, ముఖ్యమంత్రులను మార్చడం ఆ పార్టీలో నిత్యం కనిపించే సన్నివేశాలు. కర్ణాటకలో ముఖ్యమంత్రి పీఠం కోసం పలువురు పోటీ పడుతుండటంతో సిద్ధరామయ్య ఎంత కాలం ఆ పదవిలో ఉంటారోననే ప్రశ్నలు తలెత్తాయి. ఇప్పుడు శాసన సభ ఎన్నికలు జరుగుతున్న రాజస్థాన్‌లో కూడా ఆ పరిస్థితి నెలకొంది. టోంక్ నియోజకవర్గంలో తన విజయం కోసం ప్రచారం చేస్తున్న సచిన్ పైలట్ మీడియాతో మాట్లాడుతూ సీఎం అశోక్ గెహ్లాట్‌పై విరుచుకుపడ్డారు. 2020లో తాను కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశానని ఆరోపిస్తున్నారని, అసలైన తిరుగుబాటు గత ఏడాది సెప్టెంబరులో జరిగిందన్నారు. రాజస్థాన్ తదుపరి ముఖ్యమంత్రిని ఎంపిక చేయడం కోసం ఆ పార్టీ అధిష్ఠానం నిర్వహించిన శాసన సభ్యుల సమావేశానికి అశోక్ గెహ్లాట్ వర్గానికి చెందిన దాదాపు 90 మంది ఎమ్మెల్యేలు హాజరు కాలేదని పైలట్ గుర్తు చేశారు. పైలట్ తన వర్గం ఎమ్మెల్యేలతో తిరుగుబాటు చేసిన తర్వాత ఉప ముఖ్యమంత్రి పదవిని, పీసీసీ అధ్యక్ష పదవిని కోల్పోయారు.



కాంగ్రెస్‌లో టికెట్ల చిచ్చు

రాజస్థాన్ కాంగ్రెస్‌లో టికెట్ల కేటాయింపు చిచ్చు రగిల్చింది. చాలామంది సీనియర్ నేతలకు టికెట్లు దక్కకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నారు. తాజాగా మాజీ మంత్రి రామ్ గోపాల్ బైర్వా, మాజీ ఎమ్మెల్యే అశోక తన్వర్ సహా పలువురు నాయకులు పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వీరు పార్టీ వీడటంతో రెండు, మూడు సీట్లలో కాంగ్రెస్‌కు నష్టం జరుగుతుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

గెహ్లాట్ నామినేషన్ రద్దు చేయాలి

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో జోధ్‌పుర్ జిల్లా సర్దార్‌పుర నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న రాష్ట్ర సీఎం అశోక్ గెహ్లాట్ ఎన్నికల అఫిడవిట్‌లో తనపై ఉన్న క్రిమినల్ కేసులను దాచిపెట్టారని, ఆయన నామినేషన్‌ను రద్దు చేయాలని ఎన్నికల సంఘానికి రెండు ఫిర్యాదులు అందాయి. ఈ విషయమై బీజేపీ ఎంపీ గజేంద్ర సింగ్ షెకావత్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేశారు. భూ కుంభకోణానికి సంబంధించి సీఎం గెహ్లాట్‌పై ఒక కేసు నమోదైందని, దోపిడీ, రేప్, లైంగిక నేరానికి సంబంధించి మరో కేసు నమోదైందని, వీటి గురించి ఆయనకు పూర్తిగా తెలిసినప్పటికీ, వాటిని తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదని.. ఎన్నికల్లో పోటీచేసేందుకు అనర్హుడిగా ప్రకటించాలని ఈసీని కోరారు. దీనిపై పూర్తి నివేదిక అందించాలని ఎన్నికల ప్రధానాధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. తనపై కేసుల వివరాలను గెహ్లాట్ అఫిడవిట్‌లో వెల్లడించలేదని పేర్కొంటూ జైపూర్‌కు చెందిన పవన్ పారిక్ అనే మరో వ్యక్తి కూడా ఈసీకి ఫిర్యాదు చేశారు. చంపాదేవీ చారిటీ ట్రస్టుకు భూ కేటాయింపుల కుంభకోణం ఆరోపణలపై నమోదైన కేసు వివరాలను అఫిడవిట్‌లో పేర్కొనలేదన్నారు. సికర్ జిల్లాలోని రింగస్ పోలీసుస్టేషన్‌లో 2017, జులై 22న నమోదైన రేప్ కేసు, దోపిడీ కేసు కూడా నమోదైందని పారిక్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రధాన పార్టీల్లో రెబల్స్ హవా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): అటు ప్రత్యర్థి పార్టీలను ఎదుర్కోవాలో లేక సొంత పార్టీ రెబల్స్‌ను బుజ్జగించాలో తెలియక ప్రధాన పార్టీలు సతమతమవుతున్నాయి. రాజస్థాన్‌లో నామినేషన్ల ఉపసంహరణ తర్వాత అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ పార్టీల్లో రెబల్ అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఆ పార్టీలకు దిక్కు తోచని పరిస్థితులు ఏర్పడ్డాయి. రెబల్‌గా పోటీ చేస్తున్న వారిలో కాంగ్రెస్ పార్టీలో 11 మంది, బీజేపీలో 20 మంది ప్రముఖులున్నారు. వీరంతా అధిష్ఠానం తీరుపై మండిపడుతుండగా, మరికొందరు తమకు అన్యాయం జరిగిందంటూ పార్టీని వీడుతున్నారు. ఇలాంటి వారు అటు అధికార కాంగ్రెస్‌లోనే కాదు, ప్రతి పక్ష పార్టీలోనూ కనిపిస్తున్నారు. ఏది ఏమైనా రెబల్స్‌ను బుజ్జగించాలన్న రెండు ప్రధాన పార్టీల ప్రయత్నాలు ఫలించకపోవటంతో ప్రత్యర్థి పార్టీల అసంతృప్తులకు గాలం వేయడంలో రెండు పార్టీలు బిజీగా ఉన్నాయి.

రాజస్థాన్‌లో కాంగ్రెస్‌తో ఆర్ఎల్డీ కటీఫ్!

న్యూఢిల్లీ, నవంబర్ 11: అసెంబ్లీ ఎన్నికల ముంగిట కాంగ్రెస్ అసలు స్వభావం బయటపడేసరికి విపక్ష 'ఇండియా' కూటమిలో ఆయా పార్టీలు తట్టుకోలేకపోతున్నాయి. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేస్తున్న ఆర్ఎల్డీ 5 నుంచి 6 స్థానాలు ఆశించింది. చివరి సమయంలో ఒకే ఒక్క స్థానం బలవంతంగా ఇస్తామని కాంగ్రెస్ చెప్పటం ఆర్ఎల్డీని షాక్‌కు గురిచేసింది. 'ప్రాంతీయ పార్టీలను కాంగ్రెస్ కలుపుకు పోవటం లేదు. ఇదే పద్ధతిలో వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం. యూపీలో కాంగ్రెస్ పరిస్థితి ఏమిటో వారికి గుర్తుచేస్తాం' అని ఆర్ఎల్డీ నాయకుడు ప్రశాంత్ కనోజియా ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తీరుతో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) విసుగెత్తిపోయింది. విపక్ష 'ఇండియా' కూటమిలోని ప్రాంతీయ పార్టీలకు సరైన ప్రాధాన్యత ఇవ్వటం లేదని కాంగ్రెస్‌పై ఎస్పీ మండిపడింది. తాజాగా రాజస్థాన్‌లో కాంగ్రెస్ పొత్తు రాజకీయాలకు ఆర్ఎల్డీ బలైంది.

ఎన్నికల బరిలో మాజీ సీఎంల కుమారులు

భోపాల్, నవంబర్ 11: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్రానికి గతంలో సీఎంలుగా పనిచేసిన ఐదుగురి కుమారులు బరిలో నిలిచారు. వీరిలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు ఉన్నారు. మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ కుమారుడు జయవర్ధన్ సింగ్ తమ కుటుంబానికి గట్టి పట్టున్న రఘోఘర్ నుంచి పోటీచేస్తున్నారు. 1960వ దశకం ఆఖరులో సీఎంగా పనిచేసిన గోవింగ్ నారాయణ్ సింగ్ కుమారుడు ధ్రువ్ నారాయణ్ భోపాల్ సెంట్రల్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా తన అదృష్టాన్ని పరీక్షించుకొంటున్నారు. 1977-78 మధ్య జనతా పార్టీ సీఎంగా చేసిన కైలాశ్ జోషి కుమారుడు దీపక్ జోషి ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇంకా మధ్యప్రదేశ్‌కు గతంలో సీఎంలుగా చేసిన వీరేంద్ర కుమార్ సక్లేచా, అర్జున్ సింగ్ కొడుకులు ఓంప్రకాశ్ సక్లేచా, అజయ్ సింగ్ బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో నిలిచారు.

'అమృత్' కాలంలో ఆకలెందుకు?

ఉచిత రేషన్ ఎందుకన్నది చెప్పలేకపోతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నవంబర్ 11: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలవేళ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బీజేపీ నానా తంటాలు పడుతున్నది. ఆయా రాష్ట్రాల్లో అధికారం కైవసం చేసుకునేందుకు 'ఆ పద మొక్కుల'ను నమ్ముకున్నారని తెలుస్తున్నది. ఎన్నికల ప్రచారం నిమిత్తం ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లిన ప్రధాని మోదీ, ఉచిత రేషన్ పథకాన్ని మరో ఐదేండ్లు (2028 వరకు) అమలుజేస్తామని ప్రకటించారు. దీనివల్ల 80 కోట్ల మంది పేదలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఎన్నికలు..ఓట్లు లేకపోతే ప్రధాని మోదీ నుంచి ఈ ప్రకటన వచ్చేదే కాదు. అత్యంత అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా చెబుతూనే, మరోవైపు 80 కోట్లమంది ఆకలిని తీర్చేందుకు ఉచిత రేషన్ అమలుజేస్తామని చెప్పటం విమర్శలకు దారితీసింది.

ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందితే పేదలకు వచ్చేదేముంది?

అమృత్ కాలంలో, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో దేశ ప్రజలకు పెద్దగా ఒనగూడిందేమీ లేదు. రేపటినాడు మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తే..పేద ప్రజలకు వచ్చేది ఏముంటుందన్నది సామాన్యుడి ప్రశ్న. 80 కోట్లమంది ప్రజలు ఉచిత బియ్యం లేదా గోధుమల కోసం చేతులు చాచాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది కేంద్రం చెప్పటం లేదు. మోదీ సర్కార్ అనుసరిస్తున్న విధానాల ఫలితంగానే దేశం నేడు ప్రపంచ ఆకలి సూచిక-2023లో 111 నుంచి 125కు దిగజారింది. ఉపాధి, ఉద్యోగాల్లో, పేదరిక నిర్మూలనలో..ఇలా దేంట్లో చూసినా భారత్ ర్యాంకులు నేల చూపులు చూస్తున్నాయి. జీవన వ్యయం పెరిగి ప్రజల జేబు గుల్లవుతున్నది. అయినా..మోదీ సర్కార్, బీజేపీ సోషల్ మీడియా గ్రూపులు 'భారత్ ఆర్థికంగా వెలిగిపోతున్నది' అన్న ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి.

మన పాలపుంత నుంచి విడిపోతున్న నక్షత్రాలు!

న్యూఢిల్లీ : మన పాలపుంత నుంచి కొన్ని నక్షత్రాలు విడిపోయి, బయటకు పోతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. అటువంటి నక్షత్రాలు అనిశ్చిత స్థితిలో ప్రయాణిస్తున్నట్లు గమనించారు. గెలాక్సీ రొటేషన్‌ను నక్షత్రాల జనరల్ వెలాసిటీ డిస్పెర్షన్ ప్రతిబింబిస్తుంది. గెలాక్సీ రొటేషన్ నుంచి నక్షత్రం పక్కదారి పడితే, దానిని ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించగలుగుతారు. గెలాక్సీ కన్నా భిన్నమైన వేగంతో కదులుతున్న నక్షత్రాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. గెలాక్సీ నుంచి బయటకు వెళ్లే ఇటువంటి నక్షత్రాలను రోగ్ స్టార్స్ అంటారు. ఇప్పటి వరకు దాదాపు 1 కోటి నక్షత్రాలు ఈ విధంగా బయటకు పోయినట్లు అంచనా.

దేదీప్యమానంగా దీపోత్సవం

ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్యలో కన్నుల పండువగా సాగిన దీపావళి దీపోత్సవ్ గిన్నిస్ రికార్డును సృష్టించింది. సుమారు 22,23,000 మట్టి ప్రమిదలలో దీపాలను వెలిగించి ఈ సరికొత్త ఘనతను సాధించారు. ఈ కార్యక్రమానికి యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాజరయ్యారు. రామాలయం నిర్మితమవుతున్న నేపథ్యంలో అయోధ్యలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కేంద్రం కన్సల్టెన్సీ జపం

ప్రతి పనికీ వీటిపైనే ఆధారపడుతున్న శాఖలు

ఐదేండ్లలో రూ.500 కోట్లు ఫీజుగా చెల్లింపు

న్యూఢిల్లీ, నవంబర్ 11: కేంద్రం ప్రతి చిన్నా, పెద్దా పనికి కన్సల్టెన్సీలపైనే ఆధారపడుతున్నది. ఏటా వాటికి వందలాది కోట్ల రూపాయలను ఫీజుగా సమర్పించుకుంటున్నది. 'ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సమాచార హక్కు చట్టం ద్వారా దీనికి సంబంధించిన ముఖ్య సమాచారాన్ని సేకరించింది. దీని ప్రకారం 2017 ఏప్రిల్ నుంచి 2022 జూన్ వరకు ప్రైస్ వాటర్ కూపర్స్ (పీడబ్ల్యూసీ), డెలాయిట్ టచ్ తోమట్సు లిమిటెడ్, ఎర్నెస్ట్ అండ్ యంగ్ గ్లోబర్ లిమిటెడ్, కేపీఎంజీ ఇంటర్నేషనల్ లిమిటెడ్, యూఎస్ కేంద్రంగా ఉన్న మెక్‌కిన్సీ అండ్ కంపెనీ అనే నాలుగు సంస్థలకు రూ.500 కోట్ల విలువైన 300 అసైన్‌మెంట్లను కేంద్రం అప్పగించింది. వీరికి ఈ ప్రాజెక్టులను అప్పగించిన వారిలో ప్రభుత్వ మంత్రిత్వ శాఖలతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలు ఉన్నాయి. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు ఉన్నత స్థానాల్లో ఉన్న ఓఎన్‌జీసీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, కోల్ ఇండియా, పౌర విమానయాన శాఖ, ఫారెస్ట్, క్లైమేట్ ఛేంజ్, టూరిజం, రోడ్ ట్రాన్స్‌పోర్ట అండ్ హైవేస్ ఇలా పలు శాఖలు, సంస్థలు నిత్యం వీటికి ప్రాజెక్టులు అప్పగిస్తూనే ఉన్నాయి.

మోదీ వచ్చిన తర్వాతే...

ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టాక 2015 నుంచి ఈ కన్సల్టెన్సీల సంస్కృతి బాగా పెరిగింది. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలు రూపకల్పన అంతా ఈ కన్సల్టెన్సీల ద్వారానే జరిగింది. ఈ కన్సల్టెన్సీ ప్రతినిధులు అన్ని శాఖలు, సంస్థలతో నిత్యం సత్సంబంధాలు కలిగి ఉంటారు. ప్రతి ప్రాజెక్టులోనూ తమ భాగస్వామ్యం ఉండేలా వీరు ఉన్నత స్థాయిలో మేనేజ్ చేస్తుంటారు. డిజిటలైజేషన్, ఆధునిక సాంకేతికత విషయంలో వీరు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావడం, ఈ విషయంలో ప్రభుత్వ సంస్థలు వెనుకబడి ఉండటంతో వీటిపై ఆధారపడక తప్పడం లేదని ఒక ఉన్నతాధికారి తెలిపారు.

ఐస్‌ల్యాండ్‌లో 14 గంటల్లో 800 భూకంపాలు

ఐస్‌ల్యాండ్, నవంబర్ 11: స్వల్ప, మధ్యస్థాయిలో భూకంపాలు కుదిపేయడంతో ఐరోపాలోని ద్వీప దేశం ఐస్‌ల్యాండ్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. శుక్రవారం కేవలం 14 గంటల వ్యవధిలో రెక్జానెస్ ప్రాంతంలో 800 భూకంపాలు చోటు చేసుకున్నాయి. ఈ భూకంపాల కారణంగా అగ్ని పర్వతాల విస్ఫోటనం కూడా సంభవించే ప్రమాదముందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని అధికారులు తెలిపారు.

లక్ష మంది భారత కార్మికులకు తైవాన్ ఉద్యోగాలు!

న్యూఢిల్లీ: భారత్, తైవాన్ మధ్య ఈ ఏడాది డిసెంబర్ మొదట్లో 'ఎంప్లాయిమెంట్ మొబిలిటీ' ఒప్పందం జరిగే అవకాశం ఉన్నదని సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ అగ్రిమెంట్ ప్రకారం భారత్‌కు చెందిన దాదాపు లక్ష మంది కార్మికులను తైవాన్ తన ఫ్యాక్టరీలు, వ్యవసాయ క్షేత్రాలు, దవాఖానల్లో నియమించుకోనున్నదని తెలిపాయి. జనాభాలో వృద్ధుల సంఖ్య పెరుగుతున్న తైవాన్.. ఇతర దేశాల శ్రామికులను నియమించుకొనే ప్రణాళికలో ఉన్నది.

చీకట్లో గాజా దవాఖానాలు.. ఐదుగురు మృతి

జెరూసలేం: హమాస్ లక్ష్యంగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల వల్ల ఉత్తర గాజాలోని అతిపెద్ద దవాఖాన షిఫా, మరికొన్ని దవాఖానాల్లో అంధకారం అలుముకుంది. వైద్య పరికరాలు, ఔషధాల సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఐసీయూ రోగులు చనిపోతున్నారని షిఫా దవాఖాన డైరెక్టర్ అబు సెల్మియా శనివారం మీడియాకు తెలిపారు. జనరేటర్లు షట్‌డౌన్ కావటంతో నవజాత శిశువు సహా ఐదుగురు చనిపోయారని గాజా అధికార వర్గాలు వెల్లడించాయి.

చిరు ధాన్యాలపై పాట గ్రామీ అవార్డుకు నామినేట్

న్యూఢిల్లీ : చిరుధాన్యాలపై రూపొందించిన 'అబ్‌డెన్స్ ఇన్ మిల్లెట్స్' పాటకు అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. పోషకాల సమృద్ధి అంటూ పాటను రచించి, ప్రదర్శించిన ముంబయి గాయని, గేయ రచయిత ఫాల్గునీ షా, ఆమె భర్త గౌరవ్ షా ప్రపంచ ప్రఖ్యాత 'గ్రామీ అవార్డు'కు నామినేట్ అయ్యారు. 2023ను 'ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్'గా ఐరాస ప్రకటించింది. దీనిని పాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు పాటను రూపొందించారు.

సింగపూర్ పోటీలో విజేతగా బిర్యానీ

సింగపూర్ : సింగపూర్‌లో నిర్వహించిన హాకర్ ఆహార పోటీలో బిర్యానీతో పాటు ఇండియన్ రోజక్‌గా పిలిచే వెజ్-మీట్ అనే భారత వంటకం మొదటి 12 స్థానాలలో నిలిచి విజేతలుగా నిలిచాయి. ప్రముఖ గ్యాస్ పైప్ సరఫరా సంస్థ సిటీ ఎనర్జీ లిమిటెడ్ సింగపూర్‌లోని ఫుడ్ కోర్టులకు, హాకర్ సెంటర్లకు ఈ పోటీ నిర్వహించింది. ఎం-అన్సారీ ఈటింగ్ హౌస్ అనే బిర్యానీ హోటల్, ఫాజిల్ ముస్లిం ఫుడ్ స్టాల్ ఈ బహుమతులు గెల్చుకున్నాయి.



అరోరాలోకి సౌండింగ్ రాకెట్‌ను పంపిన నాసా

న్యూఢిల్లీ : నాసాకు చెందిన గొడ్డర్డ్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ ఉత్తర ధృవ మండలంలో కనిపించే ప్రకాశం (అరోరా బొరియాలిస్)లోకి సౌండింగ్ రాకెట్‌ను పంపించింది. ఆ ప్రకాశ కాంతుల ప్రభావం భూమి వాతావరణంపై ఏ విధంగా ఉంటు